నేడు అహల్యాదేవి జయంతి వేడుకలు

చిక్కడపల్లి: ధర్మ పరిరక్షకురాలు అహల్యాదేవి జయంతి వేడుకలను పురస్కరించుకుని అహల్యాదేవి జీవిత చరిత్రను ప్రజలకు పరిచయంచేసే ఉద్దేశంతో ఈనెల 23న నగరంలో రాష్ట్ర సమర్థ–దేవి అహల్యకీ పుణ్యగాథ పేరిట నాటికను ప్రదర్శించనున్నారు. విలువల పరిరక్షణే ధ్యేయంగా విశ్వమాంగల్య సభ ఆధ్వర్యంలో ఆర్టీసీ కళ్యాణ మండపంలో సాయంత్రం 5.30గంటలకు ఈ ప్రదర్శన ఉంటుందని సభ జాతీయ సహ సంఘటన కార్యదర్శి గాయిత్రి లోమ్టే తెలిపారు. దేశంలో జ్యోతిర్లింగాల పునర్నిర్మాణం, దేవాలయాల అభివృద్ధి, ధర్మపరిరక్షణకు అహల్యాదేవి చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

తాగునీటి సమస్యలు లేకుండా చూస్తాం

ముషీరాబాద్: తాగునీటి సమస్యలు లేకుండా చూస్తానని రాంనగర్ కార్పొరేటర్ రవిచారి స్థానికులకు హామీ ఇచ్చారు. శివస్థాన్‌పూర్‌లో తాగునీటి సమస్య ఉందని ఆయన దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. ఈ మేరకు శుక్రవారం పర్యటించి సమస్యలను పరిశీలించారు. వెంటనే జలమండలి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వీలైనంత త్వరగా లో–ప్రెషర్ సమస్యను పరిష్కరించాలని వారికి సూచించారు.

సైనికుల సేవలు వెలకట్టలేనివి

చిక్కడపల్లి: దేశం కోసం అమరులైన వీర జవాన్లను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లిలో ఏజీ కమాండెంట్ ఎంవీ శేషగిరి వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ఎంవీ శేషగిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సైనికుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముఠా జైసింహ, ఎం.రాకేష్‌కుమార్, పోతుల శ్రీకాంత్, ఎంవీ అశోక్‌కుమార్, ఎంవీ శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్, పున్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



చిక్కడపల్లి: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శుక్రవారం జవహర్‌నగర్‌లో శ్రీనల్ల పోచమ్మ దేవాలయం ఆవరణలో నిర్మించిన కమాన్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. స్వర్గీయ భూకాల నారాయణ యాదవ్ స్మారకర్థం ఆయన కుమారుడు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావని హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీగణపతి ఆలయం చైర్మన్ మారిశెట్టినర్సింగరావు, ఈఓ లక్ష్మారెడ్డి, వివిధ పార్టీల నాయకులు ముఠా జైసింహ, వినయ్‌కుమార్, పాశం రవి, రాకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ డిపో మేనేజర్‌గా సీహెచ్ వెంకటేశ్వర్లు

కాచిగూడ: ఆర్టీసీ కాచిగూడ డిపో మేనేజర్‌గా సీహెచ్ వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కాచిగూడ డిపో మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన టి.రఘు బదిలీపై సిద్దిపేట డిపోకు వెళ్లారు. ఈ సందర్భంగా సీహెచ్ వెంకటేశ్వర్లు డిపో అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

కవాడిగూడ: భాగస్వామ్య పింఛన్ పథకం (సీపీఎస్) రద్దు కావాలని లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో ఎస్‌టీయూఆర్ యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాచన రఘునందన్ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 23న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్రంలోని పాలకులు ఎప్పటికప్పుడు సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేస్తున్నారని ఆరోపించారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించేలా పాలకులకు మంచి బుద్ధి ప్రసాదించాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు.

వర్గీకరణ బిల్లులో 'నేతకాని'కి అన్యాయం

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లులో నేతకాని సమాజానికి తీరని అన్యాయం జరిగిందని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ అన్నారు. మాల, మాదిగల తర్వాత అత్యధిక జనాభాగా 3వ స్థానంలో ఉన్న నేతకాని సమాజాన్ని విస్మరించి తమకంటే తక్కువ జనాభా ఉన్న బుడగ జంగాలకు ఒక్క శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గ్రూప్–ఏలో చేర్చడం తమను అవమానించడమేనని అన్నారు. సీ–గ్రూపులో నేతకాని సమాజాన్ని చూపారని వ్యవసాయం చేస్తున్న నేతకానిలకు భూములపై ఎలాంటి హక్కులు లేవన్నారు. త్వరలో నేతకాని సమాజం హక్కుల సాధనకు ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు.

నల్లకుంటలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు





రాంనగర్ సెయింట్ పాయిస్ స్కూల్ పరీక్ష కేంద్రం వద్ద తనిఖీలు చేసి పంపిస్తున్న ఉపాధ్యాయులు



మొదటి పరీక్ష ప్రశాంతం

- అంబర్‌పేట నియోజకవర్గంలో పరీక్ష రాసిన 5071 మంది టెన్త్ విద్యార్థులు
- ముషీరాబాద్ నియోజకవర్గంలో 4719 మందిలో హాజరైంది 4692 మంది

గతంలో ఎన్నడూ లేదు.. ఇలా ఆల్ ది బెస్ట్ చెబుతూ..!



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల వద్ద ఇలా..

పదో తరగతి విద్యార్థులకు గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ఆల్ ది బెస్ట్ చెబుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసింది. ఈ ఫ్లెక్సీలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టివిక్రమార్క, పొన్నం ప్రభాకర్ చిత్రపటాలు ఉన్నాయి. ఈ ఫ్లెక్సీలు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి.
– ముషీరాబాద్

మొదటి రోజు ఆరుగురు గైర్హాజరు..

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో 10వ తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ప్రారంభమైయ్యాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం అయ్యింది. నియోజకవర్గం వ్యాప్తంగా 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 5077 మంది హాజరు కావాల్సి ఉండగా అందులో ఆరుగురు గైర్హాజరైనట్లు డిప్యూటీ డీఈఓ హస్రా ఫాతీమా తెలిపారు.



ముగ్గురు బాలికలు, ముగ్గురు బాలురు..



పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థినులు

కాచిగూడ: పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మొదటి రోజు విద్యార్థులు ఫస్ట్ లాంగ్వేజ్ (తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ, కన్నడ) పరీక్షలు రాశారు. పరీక్షల కోసం హిమాయత్‌నగర్ మండల పరిధిలోని కాచిగూడ, బర్కత్‌పుర, నారాయణగూడ, హిమాయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముగ్గురు బాలికలు, ముగ్గురు బాలురు పరీక్షలకు గైర్హాజరైనట్లు విద్యాధికారి హస్రా ఫాతీమా తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

ఇక్కడ 27మంది విద్యార్థులు గైర్హాజరు..



కూతురికి ఆల్ ది బెస్ట్ చెబుతూ...

ముషీరాబాద్: పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముషీరాబాద్ విద్యామండలి పరిధిలో ఏర్పాటు చేసిన 23 పరీక్ష కేంద్రాలలో 4719 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 4692 మంది విద్యార్థులు హాజరయ్యారు. 27 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. విద్యార్థులు ఉదయం 8గంటలకే వారి తల్లిదండ్రులతో పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను క్షుణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. ముందు జాగ్రత్తగా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సైతం ఏర్పాటు చేశారు.

నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గంలో శుక్రవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యార్థులు పరీక్ష రాశారు. తొలి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్‌కు పరీక్ష నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్..

పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పోలీసులు 144సెక్షన్‌ను పరీక్ష కేంద్రాల వద్ద అమలు చేశారు.విద్యార్థులను సైతం కేంద్రాల్లోకి ప్రవేశించే టప్పుడు నిశితంగా పరిశీలించారు. తల్లిదండ్రులతో సహా ఇతరులను ఎవరినీ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించలేదు. అలాగే పరీక్షా కేంద్రాలకు నియమించిన అధికారులు, తనిఖీ సిబ్బంది ఫోన్లు సైతం పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించలేదు.

విస్తృతంగా తనిఖీలు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫర్నిచర్, తాగు నీరు, ఇతర వసతులను పరిశీలించారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు విస్తృతంగా ప్రచారం చేయడంతో విద్యార్థులు నిర్దేశిత సమయానికి అర్ధగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవడం కనిపించింది.

అంకెల గారడీతో మోసం

- హామీల అమలుకు సరిపడని బడ్జెట్
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఎన్నికల సమయంలో ప్రజలకు అమలు కాని హామీలు ఇచ్చి బడ్జెట్‌లో మాత్రం ఆ వాగ్దానాల అమలుకు తగిన నిధులు కేటాయించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అలవాటుగా మారిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు. హామీల అమలుకు సరిపడని బడ్జెట్ కేటాయిస్తూ అంకెల గారడీతో ప్రజలను మోసం చేస్తున్నారని ఎద్దేవ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సాయంత్రం 'రాష్ట్ర బడ్జెట్.. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు'అనే అంశంపై వామపక్ష రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ... కార్పొరేట్ ప్రయోజనాలు కాపాడే లక్ష్యంతో ప్రవేశపెట్టిన బడ్జెట్ సరైంది కాదన్నారు.ఈ ప్రభుత్వాలకు సామాన్యులు అంటే లెక్కలేదని విమర్శించారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసే విధంగా బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావల్సిన వాటా, విభజన హామీలు అందుకు తగిన విధంగా కేటాయింపులు లేవన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నెల్లికంటి సత్యం, వివిధ పార్టీల నాయకులు ఎస్.వెంకటేశ్వర్‌రావు, ఎం.అన్వేష్, గాదగోని రావి, మురారీ, జానకీరాములు, ప్రసాద్, డీజీ నర్సింగరావు, జె.బాబురావు, ఆర్.వెంకట్రాములు తదితరులు పాల్గొని ప్రసంగించారు.



ఎస్వీకేంద్రంలో జరిగిన వామపక్షాల సమావేశంలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

అసంఘటిత రంగ కార్మికులకు పథకాలు అమలుచేయాలి



ఇందిరాపార్కు వద్ద జరిగిన మహాధర్నాలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

కవాడిగూడ: సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్కు వద్ద అసంఘటిత రంగ కార్మికులతో కలిసి మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం – ఇంటింటా సౌభాగ్యం, మేము ఇచ్చిన ప్రతి మాటను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు కోటి మందికిపైగా అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారని వారికి సామాజిక భద్రత, వెల్ఫేర్‌బోర్డు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ప్రధానంగా భవన నిర్మాణం, హమాలీలు, ట్రాన్స్‌పోర్టు, బీడీ వంటి అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత చట్టం తీసుకురావాలని హమాలీ ట్రాన్స్‌పోర్టు కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, బీడీ కార్మికులకు జీవన భృతి కనీస వేతనాల జీవో విడుదల చేయాలన్నారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.12వేల ఆర్థిక సాయం, హమాలీలకు హెల్త్‌కార్డులు ఏమి అయ్యాయని ప్రశ్నించారు. ప్రతి మండల కేంద్రంలో హమాలీనగర్ ఏర్పాటు చేసి ఇళ్లను కేటాయిస్తామని చెప్పి నేడు మొండిచేయి చూపిస్తోందని ఆరోపించారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ మహాధర్నాలో సీఐటీయూ నేతలు వంగూరి రాములు, పాలడుగు భాస్కర్, యూనియన్, ఫెడరేషన్ నాయకులు ఎస్వీ రమ, ఆర్ కోటంరాజు, పి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏ దేశ మేగినా.. ఎందుకాలిడినా..

పొగడరా నీ భూమి భారతిని..

భావకవిత్వ యుగకర్త రాయప్రోలు సుబ్బారావు సంస్మరణ సభ

చిక్కడపల్లి: అభ్యుదయ కవిత్వ యుగకర్త గురజాడ అప్పారావు అయితే భావకవిత్వ యుగకర్త రాయప్రోలు సుబ్బారావు అని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో 'రాయప్రోలు సుబ్బారావు యాదిలో..'సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా వంశీ రామరాజు మాట్లాడుతూ.. తమ కుటుంబానికి రాయప్రోలు సుబ్బారావుతో ఎంతో అనుబంధం ఉందన్నారు. ప్రతి ఏటా ఆయన జయంతిని నిర్వహిస్తున్నామని తెలిపారు. రాయప్రోలు సుబ్బారావు భావ కవిత్వంలో పలు ప్రయోగాలు చేశారన్నారు. 'ఏ దేశ మేగినా.. ఎందుకాలిడినా.. పొగడరా నీ భూమి భారతిని..'అని రాసి నాడు అందరిలో దేశభక్తిని రగిలించారని గుర్తుచేశారు.

◆ యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. నిజాం నవాబు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖను ఏర్పరచి రాయప్రోలును ఆహ్వానించి తొలి శాఖాధిపతిగా నియమించారని తెలిపారు. సాహితీ కిరణం పత్రిక సంపాదకుడు పత్రిక సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ.. రాయప్రోలు రచించిన 'తృణ కంకణం'కావ్యం ఆత్మాశ్రయ ఖండకావ్యంగా తెలుగు సాహిత్యంలో నిలిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి, గాయని సుందరవల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వంశీ రామరాజు, లంక లక్ష్మీనారాయణ

వేసవి సంగీత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: శ్రీసరస్వతి సంగీత విద్యాలయంలో వేసవి సంగీత శిక్షణ (శాస్త్రీయ సంగీతం) తరగతులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం నల్లకుంట సంగీత విద్యాలయంలో ప్రిన్సిపాల్ పోపూరి శ్రీనివాసశర్మ తెలిపారు. పూర్తి వివరాలకు నల్లకుంట శివం సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలోని సంగీత విద్యాలయంలో సంప్రదించాలని కోరారు.

గొప్ప త్యాగమూర్తి అటల్ బిహారి వాజ్‌పేయి

కాచిగూడ: దేశం సమగ్రాభివృద్ధి చెందాలని.. ప్రతి పేదోడికి ప్రభుత్వ ఫలాలు అందాలని కలలు కంటూ తన జీవితాన్నే దేశం కోసం త్యాగం చేసిన గొప్ప త్యాగమూర్తి మాజీ ప్రధానమంత్రి, దివంగత అటల్ బిహారి వాజ్‌పేయి అని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో అటల్ జీ శతజయంతి ఉత్సవాల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారత ప్రధానిగా వాజ్‌పేయి ఎన్నో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. ప్రతి పల్లెటూరుకు మంచి రోడ్డు ఉందంటే అది వాజ్‌పేయి చలువేనని అన్నారు. జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు మాట్లాడుతూ.. సంకీర్ణ ప్రభుత్వాలను సమర్థవంతంగా నడిపించిన మహనీయుడు అటల్ జీ అని కొనియాడారు. వాజ్‌పేయి సేవలను ప్రతి ఒక్కరికి తెలియజేయాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు సూచించారు.



అటల్‌జీ శతజయంతి ఉత్సవాల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న దీపక్‌రెడ్డి

ఫార్మా కంపెనీల కోసం భూములను సేకరించొద్దు

హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'అన్నదాతను ఆదుకోండి'అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం శుక్రవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో జరిగింది. ఈ సమావేశానికి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో ఫార్మా కంపెనీల కోసం ప్రభుత్వం భూములను సేకరించి ఇవ్వొద్దని.. అవసరమైతే ఆ కంపెనీలే కొనుగోలు చేస్తాయని అన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమికి భూమి ఇవ్వడంతో పాటు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలకడం బాధాకరం..

◆ ఈ దేశంలో రైతులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందరికి అన్నం పెడుతున్న రైతులు అప్పులతో ఆత్మహత్యలు చేసుకోవడం విచారకరమని అన్నారు. కార్పొరేట్ సంస్థలు రూ.16.50లక్షల కోట్లు తీసుకున్న రుణాలను ఎగ్గొట్టారని అన్నారు. ఇలాంటి కంపెనీలకు ప్రభుత్వాలు వత్తాసు పలకడం బాధాకరమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అలాంటి పొరపాట్లు చేయొద్దని సూచించారు.



'అన్నదాతను ఆదుకోండి'సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

వ్యవసాయ రంగానికి అధిక మొత్తంలో బడ్జెట్ కేటాయించాలి..

◆ రాజకీయ జేఏసీ నేత కోలా జనార్దన్ మాట్లాడుతూ... డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ఆధారంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల ఆత్మహత్యలు నివారించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి అధిక మొత్తంలో బడ్జెట్ కేటాయించాలని కోరారు. కల్తీ విత్తనాలపై ఉక్కుపాదం మోపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు ఒర్సు ఇంద్రసేన, నాయకులు నర్సింహ, పల్నాటి మల్లేష్, మేడిబావి ప్రభానంద్, సోమిడి శ్రీనివాస్, ఇంద్రవెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల బడ్జెట్ రూ.20వేల కోట్లకు పెంచాలి

కాచిగూడ: బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం రూ.11వేల కోట్లు మాత్రమే కేటాయించిందని, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం రూ.20వేల కోట్లకు పెంచుతూ బడ్జెట్‌ను సవరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం లేఖ రాశారు. రాష్ట్ర జనాభాలో 56శాతం ఉన్న బీసీలకు ఈ బడ్జెట్ ఏ మూలకు సరిపోదన్నారు. బడ్జెట్‌లో కొత్త స్కీములు ఏమీ లేవని, పెరిగిన ధరల ప్రకారం విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, మెస్ చార్జీలు పెంచే ప్రస్తావన కూడా లేదన్నారు. కాలేజీ కోర్సులు చదివే విద్యార్థులకు మొత్తం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామని సీఎం ఇచ్చిన హామీకి బడ్జెట్ కేటాయింపు లేదన్నారు. ఈ విద్యా సంవత్సరం కొత్తగా 119 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఇస్తామని చెప్పి బడ్జెట్ కేటాయించలేదన్నారు. రాష్ట్రంలో దాదాపు 8లక్షల మంది బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం దరఖాస్తులు చేసుకొని వేచి చూస్తున్నారని అన్నారు. వీరికి సబ్సిడీ రుణాలు ఇవ్వడానికి దాదాపు రూ.6వేల కోట్లు నిధులు అవసరం ఉందన్నారు. ఈ బడ్జెట్‌ను సమీక్షించి ఎన్నికల వాగ్దానం ప్రకారం బీసీలకు బడ్జెట్‌ను పెంచాలని కోరారు.

రోడ్ల ఆధునీకరణకు ప్రత్యేక చర్యలు

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్


ముషీరాబాద్: అధ్వాన స్థితికి చేరుకున్న రోడ్లను ప్రణాళికాబద్ధంగా ఆధునీకరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్‌లోని ఏక్‌మినార్, ఎంసీహెచ్ కాలనీలో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, జీహెచ్ఎంసీ డీఈ గీతాకుమారిలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్లను అభివృద్ధి పరిచేందుకు కావల్సిన నిధులను సమకూర్చుకుంటూ వెళ్తున్నామని అన్నారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థను అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు.

ఈ విషయాన్ని కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావిస్తాం..

◆ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ మాట్లాడుతూ... రోడ్ల అభివృద్ధికి జీహెచ్ఎంసీ నుంచి పూర్తిస్థాయి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సైతం నిధులివ్వాలని కోరిన పేర్కొన్నారు. గంగపుత్ర కాలనీ, భరత్‌నగర్, బాపూజీనగర్ రోడ్ల అభివృద్ధికి రూ.82 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. జీహెచ్ఎంసీ నిధులు మంజూరు చేయకపోవడంతో కౌన్సిల్ సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠాజైసింహ, నియోజకవర్గ బీజేపీ జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్ రెడ్డి, పి.శ్రీధర్‌చారి, బింగిసాగర్ శ్రీనివాస్, ముచ్చర్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి..

◆ రాజకీయాలకు అతీతంగా ముషీరాబాద్ నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం రాంనగర్ డివిజన్ బాకారంలోని భరణి ఆయిల్ వీధిలో రూ.14లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ కె.రవిచారితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాంనగర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని అన్నారు. నూతన రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ డీఈ జ్యోతికి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం నవీన్, నాయకులు అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, డీఈ గీతాకుమారి